నిత్యం నరకం



ములగాడ విలేజ్ మీదుగా శ్రావణి షిప్పింగ్ మార్గం చాలా అధ్వానంగా ఉంది. రోడ్డు అంతా గుంతలు,బురదనీరుతో నిండిపోయింది. దీంతో వాహనాల మీద ప్రయాణం కత్తిమీద సాములా మారింది. ఎక్కడ ప్రమాదానికి గురవుతామో అని కలవరం చెందుతున్నాం.ఇప్పటికైనా అధికారులు సమస్యపై స్పందించి రోడ్డును బాగు చేయాలి.

– నర్సింగరావు ,వాహనదారు



శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం దుస్థితి

రహదారి కథ.. తీరని వ్యథ!

ఆ మార్గంలో ప్రయాణం అంటే హడలే..అడుగుకో గుంత.. గజానికో గొయ్యితో వాహనదారుల ఒళ్లు హూనమే. అసలే ఇరుకు మార్గం కావడంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల సహనానికి పరీక్షే..!. దీంతో ఎన్నాళ్లీ కష్టాలు దేవుడా అని ఆ మార్గంలో ప్రయాణించేవారు వాపోతున్నారు. ఇది మారుమూల ప్రాంతంలో సమస్య కాదు సుమా.. గ్రేటర్ విశాఖ పరిధిలో ఉన్న మార్గమే.

- అడుగుకో గుంత.. గజానికో గొయ్యి
- చిన్నపాటి చెరువును తలపిస్తున్న ములగాడ మార్గం
- భారీగా నిలిచిపోతున్న ట్రాఫిక్
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు,పాదచారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ విలేజ్ నుంచి శ్రావణి షిప్పింగ్ మీదుగా మారుతీ సర్కిల్‌కు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలతో నిండిపోయింది. సుమారు రెండు వందల మీటర్ల మార్గంలో దాదాపు 300 వరకు గుంతలు ఉన్నాయంటే అతిశయోక్తికాదు. సుమారు అరఅడుగు లోతుతో కూడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. దీనికి తోడు రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఆయా గుంతల్లో బురద నీరు చేరి చిన్నపాటి చెరువును తలపిస్తున్నాయి.



మట్టితో స్థానికులు పూడ్చిన గుంతలు

హామీ హుళక్కేనా..!

ఈ మార్గంలో సమస్యను గుర్తించిన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. పోర్టు,జీవీఎంసీ అధికారులు మాట్లాడుతూ కొద్ది రోజుల్లో ఈ మార్గానికి మోక్షం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వారు హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో వాహనదారులు,పాదచారులకు తిప్పలు తప్పడం లేదు.దీంతో ఈ రహదారి కథ.. తీరని వ్యథేనా అని నిట్టూరుస్తున్నారు.

వంతెన మూసివేత నుంచి కష్టాలు

గతంలో ఈ మార్గంలో అంతగా రద్దీ ఉండేది కాదు. నేవల్ డాక్‌యార్డ్ వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను మూసివేసినప్పటి నుంచి వాహనదారులతో పాటు స్థానికులకు కష్టాలు మొదలయ్యాయి. మల్కాపురం,ప్రకాష్‌నగర్,శ్రీహరిపురం,కోరమాండల్ తదితర ప్రాంత వాసులు వివిధ పరిశ్రమల్లో ఉపాధి నిమిత్తం,వివిధ పనులపై నగరానికి లేదా గోపాలపట్నం వెళ్లడానికి ఈ మార్గంలో పయణిస్తున్నారు. దగ్గర మార్గం కావడంతో చాల మంది వాహనదారులు,ఉద్యోగులు,విద్యార్థులు ములగాడ విలేజ్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ మార్గం పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.



ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలో నిలిచిన ట్రాఫిక్



గుంతల మయంగా ములగాడ మార్గం

రోడ్డు దాటలేకపోతున్నాం

ముల గాడ విలేజ్ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం మొత్తం గుంతలతో నిండి ఉంది. ఫలితంగా ప్రతి రోజు ఇక్కడ తీవ్ర టాఫిక్ సమస్య నెలకుంటుంది. అలాంటి సమయంలో పాదచారులు కూడా సేవా మార్గాన్ని దాటలేని పరిస్థితి. అధికారులు స్పందించి ఇచ్చిన మాట ప్రకారం రోడ్డును అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నాం.

– బొట్టా సైదన్నయాదవ్, పాదచారు



క్లుప్తంగా

గ్రామదేవత ఆలయ నిర్మాణానికి పూజలు



దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న రామ్మోహన్‌నాయుడు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరికాలనీ కొండ ప్రాంతంలో గ్రామదేవత దుర్గమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు రామ్మోహన్‌నాయుడు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు యాదవ్, గ్రామ పెద్దలు,కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా మొక్కలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం మొక్కలు పంపిణీ చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణికుమారి మాట్లాడుతూ ఓ దాత సాయంతో సుమారు వెయ్యి మొక్కలు పంపిణీ చేసినట్టు చెప్పారు. మొక్కలు మానవ మనుగడకు ఆధారం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు.


మహిళలకు స్వయం ఉపాధిపై అవగాహన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య: మహిళలకు స్వయం ఉపాధిపై మెప్మా ఆధ్వర్యంలో జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ మహిళలు ఉపాధి అవకాశాలు పెంపొందించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మికి అభినందన



విజయలక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య: జాతీయ స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికైన ఎం. విజయలక్ష్మిని సోమవారం ఎమ్మెల్యే గణబాబు అభినందించారు. ఇటీవల గుజరాత్‌లో జరిగిన ఆల్ ఇండియా వాలీబాల్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజయలక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సాయి ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షకుడు ఎం. సత్యనారాయణ ఆధ్వర్యంలో విజయలక్ష్మి సాధన చేస్తుంది. ఆమెను అభినందించిన వారిలో డీఎస్‌డీవో జాన్ గాలియట్, రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి భగవాన్ దాస్ ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి విభాగాధిపతిగా ఆస్పత్రి జీఎం (మెడికల్) డాక్టర్ జె.ఎస్. సారంగి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్ పదవీ విరమణ చేశారు. ఆ బాధ్యతలను డాక్టర్ జె.ఎస్. సారంగికు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన సారంగినికి వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తరాంధ్ర మాలల గర్జనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాటూరి చిన్నారావు

సింధియా: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా విశాఖనగరంలోని సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఈ నెల 8వ తేదీన జరగబోవు ఉత్తరాంధ్ర మాలల గర్జన కార్యక్రమాన్ని విజమవంతం చేయాలని దళితరత్న మాటూరి చిన్నారావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్‌కాలనీలో సోమవారం మాటూరి చిన్నారావు ఏడువార్డుల దళిత నాయకలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు చేస్తున్న అన్యాయాన్ని ఎదురించేందుకు జరుగుతున్న ఉత్తరాంధ్ర మాలల గర్జన కార్యక్రమానికి అత్యధికంగా మాలలను సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా మాల నాయకులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గుడాల ఈశ్వరరావు, తంతటి సంపత్‌కుమార్, దేవా, గాంధీ, ఎం.హనుమంతురావు, జి.విజయకుమార్, రావాడ అప్పారావు, గుడాల బాబూరావు, నడుపూరు రమణ, నందికోళ్ల శ్రీధర్, ఎన్.కృష్ణ, కామాక నర్సింగరావు, బడుగు భీమ్‌జీ పాల్గొన్నారు.

లింగ ఆధారిత హింసపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న స్కిల్ కాలేజీ విద్యార్థులు

సింధియా: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్)లో మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆదేశాల మేరకు సోమవారం ఉమెన్స్ స్కిల్ కాలేజీ సీఈవో సేతు మాధవన్ ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింసపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్కిల్ కాలేజీ మేనేజర్ ప్రజీత్‌కురుప్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడం హర్షణీయమన్నారు. సమాజంలో ఎదురయ్యే ఇబ్బందులను మహిళలు సమర్థవంతంగా ఎదుర్కొని ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ముందంజ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ కాలేజీ కోఆర్డినేటర్ కుమారి, పి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌ను సందర్శించిన సైనిక్ స్కూల్ క్యాడెట్‌లు




కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులతో షిప్‌యార్డ్‌సీఎండీ హేమంత్‌ఖత్రి, ఇతర అధికారులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సోమవారం కోరుకొండ సైనిక్ స్కూల్‌కు చెందిన క్యాడెట్‌లు సుమారు 100 మంది సందర్శించారు. క్యాడెట్‌లకు షిప్‌బిల్డింగ్ పరిశ్రమకు చెందిన వివిధ షిప్‌లు, సబ్‌మెరైన్‌ల నిర్మాణం, మరమ్మతుల ప్రక్రియ వంటి విలువైన అంశాలపై హెచ్ఎస్ఎల్ ఇంజినీర్లు, అధికారులు అవగాహన కల్పించారు. ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, ఇతర సముద్ర సంబంధ రంగాలకు హెచ్ఎస్ఎల్ అందించిన సహకారాన్ని సమగ్రంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో ఇంటరాక్ట్ అయిన షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి మాట్లాడుతూ విద్యార్థుల చేతుల్లో దేశ భవిత ఉందన్నారు. సముద్ర రంగంలో ఎదగాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు షిప్‌యార్డ్ సందర్శనకు రావాలని కోరారు. వారికి అధికారులు సంస్థలో వివిధ విభాగాల పనితీరును సమగ్రంగా వివరిస్తారన్నారు.

పోలీసుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట

- సిబ్బందికి అండగా ఉంటాం
- వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సీపీ శంఖబ్రత బాగ్చి



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి



హాజరైన పోలీసులు, వారి కుటుంబ సభ్యులు

మహారాణిపేట: నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమయ్యే పోలీసులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. సుమారు 3 వేల మందికి పైగా పోలీస్, హోం గార్డుల కుటుంబ సభ్యులకు కేజీహెచ్‌లో నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత తమ కర్తవ్యమని, వారు ఆరోగ్యంగా ఉంటే విధులు నిర్వర్తించడం సులువుగా ఉంటుందని సీపీ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ఇప్పటికే సిబ్బంది ఫిట్‌నెస్, మానసిక ప్రశాంతత కోసం యోగా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఊబకాయం తగ్గించుకుంటే విధి నిర్వహణలో మరింత చురుగ్గా పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా సిబ్బంది వారి కుటుంబ సభ్యుల వైద్య పరీక్షలు వివరాలు డిజిటల్ రూపంలో పొందుపరుస్తున్నామన్నారు. మానసిక సమస్యలతో పాటు, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న సిబ్బంది వివరాలు తమకు తెలియజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి భరోసా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మోహర్ కుమార్, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, డైట్ చీఫ్ హెచ్ వి.రమణమూర్తి, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సులభ్‌కాంప్లెక్స్‌కు తాళాలు!



నిరుపయోగంగా మారిన సులభ్‌కాంప్లెక్స్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ఎదురువానిపాలెం శివారు ప్రాంతంలో 10 ఏళ్ల కిందట సుమారు రూ. 5 లక్షల వ్యయంతో సులభ్‌కాంప్లెక్స్ నిర్మించారు. అయితే మోటర్ మరమ్మతులకు గురికావడంతో దీన్ని పట్టించుకునే నాథుడు లేక సులభ్ కాంప్లెక్స్‌కు తాళాలు పడ్డాయి. ప్రస్తుతం ఈ కాంప్లెక్స్ పూర్తిగా రంగులు వెలిసి, గేటు తుప్పుపట్టి తాళం విరిగిపడి ఉంది. దీంతో కొంత మంది ఆకతాయులు రాత్రి సమయంలో సులభ్ కాంప్లెక్స్ లోపలకు ప్రవేశించి గంజాయి,ధూమపానం, మద్యం సేవిస్తూ కాలక్షేపం చేస్తున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సులభ్‌కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి జెడ్సీ తారా ప్రసన్నరెడ్డి

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి ఇన్‌చార్జి జోనల్ కమిషనర్, ఈఈ తారా ప్రసన్నరెడ్డి వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి రెండు వినతులు అందినట్లు ప్రసన్నరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఎన్.పుణ్యవతి, కృపానందం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భోపాల్‌కు ఎల్జీ పాలిమర్స్ బాధితులు

విశాఖ విద్య: భోపాల్‌లోని ఎల్జీ పాలిమర్స్ 40వ వార్షికోత్సవానికి గోపాలపట్నం ఎల్జీ పాలిమర్స్ బాధితుల సంక్షేమ సంఘం నాయకులు హాజరవుతున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 5 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గ్యాస్ లీకేజీ, విపత్తు బాధితుల సవాళ్లపై చర్చించేందుకు భోపాల్ వేదికగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడి ఎల్జీ పాలిమర్స్‌కు అందిన ఆహ్వానం మేరకు బాధితుల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం బయలు దేరి వెళ్లారు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి



క్యాంపు కార్యాలయం నుంచి బస్సులో జీవీఎంసీకి చేరుకున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖలో కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా వినియోగించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.

ఎయిర్ పోర్టు జోన్ సీఐగా ఉమామహేశ్వరరావు



సీఐ ఉమా మహేశ్వరరావు

విశాఖ విద్య: ఎయిర్ పోర్టు జోన్ సీఐగా జి.ఉమామహేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐ గా అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట ,నర్సీపట్నం , కొత్త కోట తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. అనంతరం 2019లో సీఐగా పదోన్నతి పొందిన ఆయన అనకాపల్లి సి.సి.ఎస్, పరవాడ లా అండ్ ఆర్డర్, స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్ ,శ్రీకాకుళం టూ టౌన్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించి ప్రస్తుతం వీఆర్ నుండి ఎయిర్ పోర్టు సీఐగా నియమితులయ్యారు. ఎయిర్ పోర్టు సీఐగా విధులు నిర్వహించిన చక్రధర్ ద్వారకా క్రైం సీఐగా బదిలీపై వెళ్లారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఉమా మహేశ్వరరావు స్టేషన్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేశారు.

వేడుకగా పోలిపాడ్యమి పూజలు



గొల్లకంచరపాలెం శ్రీకృష్ణ మందిరంలోని కొలను వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కోదండ ఈశ్వరాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు



శ్రీహరిపురం వద్ద కృత్రిమంగా ఏర్పాటు చేసిన తొట్టెలో దీపాలు విడిచిపెడుతున్న భక్తులు

కంచరపాలెం: కంచరపాలెం పరిధిలోని దేవాలయాల్లో సోమవారం పోలి పాడ్యమి పూజలు ఘనంగా నిర్వహించారు. గొల్ల కంచరపాలెం శ్రీకృష్ణ మందిరంలో ఆలయ కమిటీ, శ్రీరామా సేవా సమాజం (యాదవ్) సభ్యులు, తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో, రెడ్డికంచరపాలెం శ్రీరామ సేవా సంఘం, 104ఏరియా బాపూజీనగర్‌లో కోదండ ఈశ్వరాలయంలో గ్రామ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కోనేరులో మహిళా భక్తులు దీపాలు వదిలి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాశివలింగానికి ప్రత్యేక హారతులతో పూజలు చేసినట్టు అర్చకుడు సూర్యప్రకాశ్ శర్మ తెలిపారు.

మల్కాపురం: పోలి పాడ్యమి (పోలి స్వర్గం) పూజలను పారిశ్రామిక ప్రాంతంలో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొంత మంది ఇళ్ల ముందు కృత్రిమంగా ఏర్పాటు చేసుకున్న నీటి తొట్టెలో అరటి దవ్వలపై దీపాలు వెలిగించి వదిలారు.అలాగే శ్రీహరిపురం,జవహర్‌నగర్ వద్ద కృత్రిమంగా ఏర్పాటు చేసిన పెద్ద నీటితొట్టెలో మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. అనంతరం మహాశివుడిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులకు స్వయంపాకంతో పాటు పలు దానాలు చేశారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంలో పాల్గొన్న పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏపీపీసీబీ జోనల్ కార్యాలయంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, ఏయూ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ బాలప్రసాద్, ఏపీపీసీబీ మాజీ సీఈఈలు ఎస్.వి.భాస్కరరావు, కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలిచ్చారు. కాలుష్య నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలను విశదీకరించారు. కార్యక్రమంలో శ్రావణ్ షిప్పింగ్ ఎండీ సాంబశివరావు, గ్రీన్‌క్లైమేట్ ప్రతినిధి రత్నం, జేసీఈఈ డాక్టర్ పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.